# 'స్పీడ్' పరిధిలోకి ఆ 19 ప్రాజెక్టులు



- సీఎం రేవంత్ కీలక నిర్ణయం

**బలగం టీవి, న్యూఢిల్లీ**

రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక మిషన్ చేపట్టింది..స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ(స్పీడ్) పేరుతో కొత్త కార్యాచరణ రూపొందించింది. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 19ప్రాజెక్టులు, పనులను స్పీడ్ పరిధిలోకి తెచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటిని స్వయంగా పర్యవేక్షిస్తారు. పనుల తీరు, పురోగతిపై సంబంధిత విభాగాల అధికారులతో నెలకోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ పనులన్నింటినీ నిర్ణీత వ్యవధిలో సమర్థవంతంగా పూర్తి చేయాలనేది స్పీడ్ ప్రధాన లక్ష్యం. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రామాణికమైన మౌలిక సదుపాయాల కల్పనలో వివిధ విభాగాల మధ్య ఉన్న అడ్డంకులు, అవరోధాలు అధిగమించేందుకు స్పీడ్ ప్రత్యేక చొరవ తీసుకోనుంది..

స్పీడ్ కింద చేర్చిన పనుల పురోగతిపై సీఎం రేవంత్ రెడ్డి నెలకోసారి సమీక్ష నిర్వహిస్తారు. దీని వల్ల ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా నేరుగా ముఖ్యమంత్రి స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుంది. పట్టణాలు సహా అన్ని ప్రాంతాల్లోని అభివృద్ధి పనులపై స్పీడ్ దృష్టి కేంద్రీకరిస్తుంది. స్పీడ్ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఆయా విభాగాలు ప్రత్యేక విధానం అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

క్రమం తప్పకుండా పనితీరు సమీక్షించుకుని పర్యవేక్షణకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా తమ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు, పనులపై సంబంధిత విభాగాలు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తాయి. స్పీడ్ ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ప్రణాళిక విభాగం ఆన్ లైన్ పోర్టల్ రూపొందిస్తుంది. ఏ రోజుకు ఎంత పని జరిగిందనే అప్ డేట్ డేటాను అందులో పొందుపరచాలి. ఏ గడువులోగా ఎంత పని జరుగుతుందనే నిర్ణీత కాల వ్యవధిని ఆయా విభాగాలు ఆన్ లైన్ పోర్టల్లో అప్డేట్ చేయాలి. ఎప్పటివరకు ఏఏ పనులు పూర్తవుతాయనే అంచనాలను సైతం పోర్టల్‌లో ఉంచాలి.

**స్పీడ్ ప్రోగ్రామ్‌లోని 19 ప్రాజెక్టులు ఇవే..**

-మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్-శాటిలైట్ టౌన్ల అభివృద్ధి -మెట్రో రైలు విస్తరణ-జీహెచ్ఎంసీ పునర్ వ్యవస్థీకరణ

-రీజినల్ రింగ్ రోడ్-హైదరాబాద్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు

-రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు

-ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం

-మహిళా శక్తి పథకం అమలు-జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం

-రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లు

-అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సంస్థాగత అభివృద్ధి

-ఐటీఐలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

-కొత్త ఉస్మానియా హాస్పిటల్

-15 కొత్త నర్సింగ్, 28 కొత్త పారా మెడికల్ కాలేజీలు

హెల్త్ టూరిజం ప్రమోషన్

ఎకో టూరిజం ప్రాజెక్టుల ప్రమోషన్

టెంపుల్ సర్క్యూట్స్ టూరిజం

యాంటీ డ్రగ్స్ స్ట్రాటజీ అమలు

# శాంతివైపే మేముంటాం

- భారత్ ఎప్పుడూ తటస్థంగా ఉండాలనుకోదు
- ప్రధాని మోడీ
- కీవ్ లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో చర్చలు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

రష్యా-ఉక్రెయిన్ సంక్షోభంలో భారత్ తటస్థంగా ఉందంటూ తరచుగా వినిపిస్తున్న వాదనలను భారత ప్రధాని మోడీ తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్ స్కీ సమక్షంలో మోదీ మాట్లాడుతూ... భారత్ ఎప్పుడూ తటస్థంగా ఉండాలనుకోదని, భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే ఉంటుందని స్పష్టం చేశారు. యుద్ధానికి దూరంగా ఉండాలన్న దృఢనిశ్చయంతో తాము ఈ మార్గాన్ని ఎంచుకున్నామని ఉద్ఘాటించారు. యుద్ధానికి దూరంగా ఉండడం అంటే తటస్థ మార్గాన్ని ఎంచుకున్నట్టు కాదని, మొదటి రోజు నుంచే శాంతి స్థాపన దిశగా బలంగా నిలబడ్డామని మోదీ పేర్కొన్నారు. దౌత్య మార్గాల్లో సంప్రదింపులు, చర్చల ద్వారానే శాంతి సాకారం అవుతుందన్న వాదనకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని, ఈ ప్రాంతంలో తిరిగి శాంతి నెలకొల్పేందుకు అవసరమైన అన్ని చర్యలకు తమ సహకారం ఉంటుందని అన్నారు.

"నేను వచ్చింది బుద్ధ భగవానుడు, మహాత్మా గాంధీ నడయాడిన గడ్డ నుంచి. యుద్ధం అనే అంశానికి మా వద్ద తావు లేదు. ఇవాళ నేను ఇక్కడికి



వచ్చింది కూడా శాంతి సందేశంతోనే" అని మోదీ స్పష్టం చేశారు.

# రూ.300కే ఇంటర్నెట్, కేబుల్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ మౌలిక సదుపాయాలకు అందించాలని ప్రతిపాదించారు.

ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశను భారత్ నెట్ - 3 ఆర్కిటెక్చర్ కు మార్చడానికి గతేడాది అక్టోబరులో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ ను పంపించిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ డీపీఆర్‌ను త్వరగా ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. భారత్ నెట్ - 3 ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల పౌరులకు ఈ-గవర్నెన్సును అందించగలుగుతామని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన భారత్ నెట్ ఉద్యమి పథకాన్ని టీ-ఫైబర్ కు వర్తింపజేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

# జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అవకాశం ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

పథకం కింద నిధులు విడుదలను పెంచాలని కేంద్ర మంత్రి మాండవీయను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, సెంట్రల్ యూనివర్సిటీలోనిషఉటింగ్ రేంజ్, ఎల్ బీ స్టేడియం, హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలలో మౌలిక వసతుల అభివృద్ధికి తాము ఇప్పటికే పంపించిన డీపీఆర్‌లను ఆమోదించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం..

- గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి..
- సిరిసిల్ల డిఎస్పి చంద్రశేఖర్ రెడ్డి



**బలగం టీవీ, సిరిసిల్ల**

నేరాల నియంత్రణనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుంది అని సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి మట్లాడుతు గ్రామంలో సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 30 ద్విచక్ర వాహనాలు, అక్రమ గుడుంబా తయారీకి కోసం నిల్వ ఉంచిన 120 లీటర్ల జాగిరి,4 లీటర్ల గుడుంబా,అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్ షాప్ లో 3000 రూపాయల విలువ గల మద్యం స్వాధీన పర్చుకొని వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.ప్రజల రక్షణ గురించి ప్రజలలో భద్రతాభావం సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ కల్పించడం, ప్రజల యొక్క సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు.పట్టణ,గ్రామంలో, కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు కానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని, గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతూ వుంటే వెంటనే పోలీసులకు,లేదా డయల్ 100 కాల్ కు చేసి సమాచారం అందించాలని వెంటనే చర్యలు చేపడతాం అన్నారు.



గ్రామాల్లో యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో గంజాయి,గుడుంబా తయారీకి సంబంధించిన సమాచారం ఉంటే పోలీస్ వారికి అందించాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలల్లో,నేరాల నియంత్రణ లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, ఎస్ఐ లు ఎల్లగౌడ్, గణేష్, రాంమ్మోహన్,పోలీస్ సిబ్బంది , డిస్ట్రిక్ట్ గార్డ్స్ పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ కాదు.. చలో పల్లె చేపట్టాలి..

**బలగం టీవీ, హైదరాబాద్**

సీఎం రేవంత్‌కు దమ్ముంటే చలో ఢిల్లీ కాదు.. చలో పల్లె చేపట్టాలని.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. రుణమాఫీ కాక లక్షలాది రైతులు రగిలిపోతుంటే.. వారివైపు కన్నెత్తి కూడా చూడకుండా హస్తిన యాత్రలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకటి కాదు.. రెండుకాదు.. ఎనిమిది నెలల్లో.. ఏకంగా 20 సార్లు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడతారా..? రిమోట్ కంట్రోల్ పాలనతో రైతులను బలి చేస్తారా..? అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

ఎన్నికల్లో అన్నీ గాలి మాటలు చెప్పారు.. గద్దెనెక్కగానే గాలిమోటర్లలో ఊరేగుతున్నారు.. మీ యాత్రలతో తెలంగాణ ప్రజలకు ఒరిగిన ప్రయోజనమేంటి..? అని కేటీఆర్ విమర్శించారు. అన్నదా



తలను ఆగంచేసి.. దేశ రాజధాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తే..రైతుల తండ్లాట తీర్చేదెవరు.. రుణమాఫీ పూర్తిచేసెదెవరు..?? అధిష్టానం మెప్పు కోసం పగలూ రాత్రి తపన తప్ప అన్నం పెట్టే రైతుల తిప్పల గురించి ఆలోచించే తీరిక లేదా..?? అని ప్రశ్నించారు.రైతులకేమో మాయమాటలు.. ఢిల్లీ పెద్దలకు మాత్రం మూటలా?? 20 సార్లు చేపట్టిన ఢిల్లీ యాత్రలతో

తెలంగాణకు దక్కింది.. "గుండుసున్నా". ఓవైపు డెంగీ మరణాలు.. మరోవైపు పెరుగుతున్న నేరాలు.. ఇంకోవైపు అన్నదాతల ఆందోళనలు.. గాడితప్పిన పాలనతో.. రాష్ట్రమంతా అట్టుడుకుతున్న ఈ విపత్కర పరిస్థితుల్లో.. ముఖ్యమంత్రి, మంత్రులు ఉండాల్సింది.. ఢిల్లీలో కాదు.. తెలంగాణ గల్లీల్లో.. రాష్ట్రాన్ని గాలికొదిలేసి.. అన్నదాతలను అరిగోస పెట్టి.. హైకమాండ్ ఆశీస్సుల కోసం ప్రతిక్షణం పాకులాడితే.. తెలంగాణ సమాజమే ఏదోరోజు కుర్చీ లాగేయడం తథ్యం అని కేటీఆర్ హెచ్చరించారు.

## భారీగా పెరిగిన భారత్ విదేశీ మారకద్రవ్యం

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత విదేశీ మారకద్రవ్యం భారీగా పెరిగింది. ఆగస్టు 16 నాటికి భారత్ ఖాతాలో ఉన్న విదేశీ మారకద్రవ్యం రూ.56.5 లక్షల కోట్లు అని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) వెల్లడించింది. వారం రోజుల వ్యవధిలో భారత్ విదేశీ మారకద్రవ్యం రూ.38,137 కోట్ల మేర పెరుగుదల నమోదు చేసుకుందని ఆర్బీఐ వివరించింది. అదే సమయంలో, ఆగస్టు 16 నాటికి నగదు రూపేణా ఆస్తుల విలువ రూ.30,178 కోట్లు పెరిగి రూ.49.5 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. బంగారం నిల్వలు రూ.7,251 కోట్ల పెరుగుదలతో రూ.5.03 లక్షల కోట్లకు చేరినట్టు ఆర్బీబీ డేటా వెల్లడించింది.

## ఏసీబీకి చిక్కిన స్టేట్ టాక్స్ ఆఫీసర్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఓ వాణిజ్య పన్నుల శాఖ అధికారిణి అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. అబిడ్స్‌లోని కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో స్టేట్ టాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఇందిరా రెండు రోజుల క్రితం నారాయణగూడ ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారికి జీఎస్టీ పెండింగ్‌లో ఉందంటూ, నోటీసులు జారీ చేశారని ఏసీబీ డీఎస్పీ కె.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జీఎస్టీ చెల్లింపుతో పాటు భవిష్యత్‌లో అతని వ్యాపారానికి ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా ఉండాలంటే, రూ.50 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. చివరకు రూ.35వేలకు ఒప్పందం కుదిరిందని, అయితే వ్యాపారి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అబిడ్స్‌లోని కార్యాలయంలో రూ.35 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారిణి ఇందిరాపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## ప్రజాపాలనలో పూర్తిగా పడకేసిన ప్రజారోగ్యం : కేటిఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ముఖ్యమంత్రి సహా రాష్ట్ర యంత్రాంగమంతా ప్రజారోగ్య వ్యవస్థను గాలికొదిలేయడంతో జనం విషజ్వరాలతో మంచం పట్టే దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రజారోగ్యం పూర్తిగా పడకేసిందని అన్నారు.పారిశ్యుద్ధ నిర్వహణ పూర్తిగా దిగజారిపోయిందని, ఫలితంగా తీవ్రమైన దోమల బెడద కారణంగా డెంగీ సహా విజృంభిస్తున్న విష జ్వరాలతో జనం పరేషాన్ అవుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నా మీ ప్రభుత్వానికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు.

అధికారిక లెక్కల ప్రకారమే ఈ ఏడాదిలో దాదాపుగా 5,700 డెంగీ కేసులు నమోదయ్యాయని, కానీ అనధికారికంగా దీనికి పది రెట్లు ఎక్కువగా ఈ సంఖ్య ఉంటుందని తెలిపారు. డెంగీకి సరైన సమయంలో చికిత్స అందకపోవడం వల్ల ఒక్క డెంగీతోనే ఇటీవల దాదాపు 50 మంది చనిపోయారని, ఇందులో చిన్నపిల్లలు కూడా ఉండటం అత్యంత బాధాకరమన్నారు.అత్యంత ప్రాధాన్యమైన ప్రజా ఆరోగ్యం అంటే ఈ ముఖ్యమంత్రికి పట్టింపు లేదా కేటీఆర్ నిలదీశారు. పట్టించుకోవాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి రాజకీయ యాత్రలు చేయడం దారుణమని తేన్నారు. పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తే సగం సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇకనైనా రాజకీయాలపై దృష్టి పెట్టడం మాని రాష్ట్రంలో విజృంభిస్తున్న డెంగీ, మలేరియా ఇతర విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

(మొదటి పేజీ తరువాయి)

కానీ ఢిల్లీకి 20 సార్లు పోయిండు. క్షేత్రంలో తిరగాల్సిన సీఎంఢిల్లీ చుట్టు చక్కర్లు కొడుతున్నారు. సీఎంకు దమ్ముంటే నువ్వు ఏ ఊరికి పోదామో చెప్పు. అక్కడికి వెళ్లి రుణమాఫీ అయ్యిందా అనే విషయాన్ని అడుగుదాం. ఎక్కడ కూడా చారాణ రుణమాఫీ కాలేదు అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో మనం పోలీసులను, వ్యవసాయ అధికారులను తప్పు బట్టాల్సిన పని లేదు. తప్పు ముఖ్యమంత్రిది, చేతకాని సన్నాసి సీఎంది. అయితే పోలీసుల మీద మాకు సానుభూతి ఉంది. కానీ కొంత మంది పోలీసులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు అది మంచిది కాదు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారు. అత్యుత్సాహం ప్రదర్శించవద్దు. అధికారం మారుతుంది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని పోలీసులకు సూచిస్తున్నా. తిరుమలగిరి ఘటనలో దాడి చేసిన వారిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయాలి. మహిళా జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కూడా కేసులు పెట్టి అరెస్ట్ చేయాలి. జర్నలిస్టులకే రక్షణ లేకపోతే రాష్ట్రంలో సామాన్య పౌరుల పరిస్థితి ఏందీ? అని కేటీఆర్ నిలదీశారు.

మంచిర్యాలలో ఎమ్మెల్యే కారణంగా మా నాయకుడు గొంతు కోసుకున్నాడు. మొత్తంగా వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ఈ ముఖ్యమంత్రి అధికారం చెలాయించాలనుకుంటే అంతకన్నా మూర?త్వం మరొకటి ఉండదు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. నెల రోజుల్లో 28 హత్యలు అనే వార్తలు వస్తున్నాయి. ఈ నగరానికి ఏమైంది అంటూ సీఎంకు దన్నుగా నిలిచిన పత్రికలే వార్తలు రాస్తున్నాయి. పోలీసు యంత్రాంగం మీద మాకు సానుభూతి ఉంది. మిమ్మల్ని అడ్డం పెట్టుకొని సీఎం అధికారం చెలాయిస్తున్నాడు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా మా పార్టీ యువకులను వేధిస్తున్నారు. ఇంకా ఇలాగే కొనసాగితే మా నుంచి ప్రతిఘటన కూడా తప్పదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినవద్దనే మేము ఇప్పటి వరకు ఊరుకుంటున్నాం. మా సహనాన్ని, చేతగాని తనం అనుకోవద్దు. మేము ప్రతిఘటిస్తే అప్పుడు మమ్మల్ని నిందించవద్దు. కొంతమంది పోలీసులు మంత్రుల బర్త్ డే కార్యక్రమాల్లో పరవశించి పోతున్నారు. డీజీపీకి ఇలాంటి పోలీసుల మీద చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అన్ని నిర్మాణాలను కూల్చండి. పొంగులేటి, వివేక్, కేవీపీ, మధుయాష్కీ లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి అని కేటీఆర్ సూచించారు.

నిబంధనలకు విరుద్ధంగా పొంగులేటి ఇల్లు ఉందన్నారు కేటీఆర్. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆయన తమ్ముడి ఫాంహౌస్ ఉందో, లేదో రంగనాథ్‌ను అడిగితే ఆయనే చెప్తారని తెలిపారు. మొదట ఆయన ఫాంహౌస్ కులగొట్టిన తరువాతనే సామాన్యుల ఇండ్ల జోలికి వెళ్లాలన్నారు. అలాగే, గుత్తా సుఖేం దర్ రెడ్డి, వివేక్ వెంకట స్వామి, పట్నం మహేందర్ రెడ్డి, కేవీపీ రామచంద్ర రావు, పల్లం రాజు ఫాంహౌస్‌లు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని చెప్పారు.

## వ్యవసాయాధికారులు స్వయంగా రైతుల వద్దకు వెళ్లాలి

- మంత్రి తుమ్మల
- రుణమాఫీలో తలెత్తిన సమస్యలపై అధికారులతో మంత్రి సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్**



రుణమాఫీపై క్షేత్రస్థాయిలో తలెత్తిన సమస్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారుల నుంచి ఆరా తీశారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించడంపై వ్యవసాయాధికారులతో ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయాధికారులు స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లి లేదా రైతు వేదికలు, కార్యాలయాల్లో అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రూ.2 లక్షల లోపు రుణాలను కుటుంబ నిర్ధారణ జరిగిన వారికి మాఫీ చేశామన్నారు. కుటుంబ నిర్ధారణ జరగని 4,24,873 ఖాతాల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సమాచార సేకరణకు కొత్త యాప్ ఉపయోగపడుతుందన్నారు.

వివరాలు తప్పుగా నమోదైన 1,44,545 ఖాతాలకు సంబంధించి ఇప్పటికే 41,322 అకౌంట్లను సరి చేసినట్లు చెప్పారు. వివిధ బ్యాంకుల్లో ఉన్న ఖాతాదారుల అకౌంట్లలో ప్రభుత్వం జమ చేసే మొత్తాలను రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెన్యువల్ అయిన ఖాతాలకు సొమ్మును తిరిగి చెల్లించేలా, మాఫీ అయిన అకౌంట్లకు సంబంధించి తిరిగి కొత్త రుణాలు మంజూరు చేసే విధంగా బ్యాంకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

## మూగజీవాలను పట్టించుకోండి

- సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ

**బలగం టీవీ, హైదరాబాద్**

వ్యవసాయంలో దన్నుగా నిలుస్తూ, పాడిసంపదతో అదనపు ఆదాయాన్ని సమకూర్చే మూగజీవాల సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం శోచనీయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మూగజీవుల మౌన రోదనను తొలగించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొన్నదని విమర్శించారు. పశుసంవర్ధక శాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఉన్నప్పటికీ మూగజీవాల మౌనరోదనను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందుల కొరత ఉన్నదని, 1962 పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయంపై సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొందన్నారు.

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు మీరు గాని, ఉన్నతాధికారులు గానీ ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించకపోవడం మూగజీవుల సంరక్షణ పట్ల మీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తున్నదన్నారు. వానాకాలంలో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి నిర్లక్ష్యం వీడి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నానన్నారు. 1962 పశువైద్య సంచార వాహనాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# నా ఇల్లు అక్రమమైతే కూల్చేయండి...

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని, అయినప్పటికీ తాము హామీలు నెరవేర్చామన్నారు. ధనిక రాష్ట్రమని చెప్పి కేసీఆర్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. తాము ఇతర ఖర్చులను తగ్గించుకొని రుణమాఫీ చేశామన్నారు. 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ చేశామన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.18 వేల కోట్లు జమ అయ్యాయని, మిగిలిన రైతుల ఖాతాల్లోను మరో రూ.12 వేల కోట్లు త్వరలో వేస్తామన్నారు.కేసీఆర్ ప్రభుత్వంలా తాము మోసం చేయడం లేదన్నారు. రుణమాఫీ విషయంలో గత ప్రభుత్వం రైతులను రెండుసార్లు మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కూడా కొందరికే రుణమాఫీ చేశారన్నారు. ప్రచారం కోసం గత ప్రభుత్వంలా వేల కోట్ల రూపాయలను వృథా చేయడం లేదన్నారు.

ఉచిత విద్యుత్ కోసం 42 లక్షల దరఖాస్తులు మాత్రమే సక్రమంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. తప్పులను సవరించి మరో 7 లక్షల మందికి పైగా ఉచిత విద్యుత్ వర్తింప చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ రాయితీ లబ్ధిదారుల సంఖ్య నిత్యం పెరుగుతోందన్నారు. దరఖాస్తుల్లో తప్పులు ఉంటే సవరణలు చేస్తున్నట్లు చెప్పారు. 18 రాష్ట్రాల రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి కొత్త ఆర్వోఆర్‌ను తీసుకువస్తున్నామన్నారు. ఇది దేశానికే రోల్ మోడల్ అన్నారు.

## పాతబస్తీలో మెట్రోకు

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

వెడల్పులో విస్తరణ ఉంటుందన్నారు. దారుల్ షఫా నుంచి శాలిబండ జంక్షన్ వరకు ప్రెజెంట్ రహదారి వెడల్పు 50 అడుగుల నుంచి 60 అడుగుల వరకు, శాలిబండ జంక్షన్ నుంచి చంద్రాయణ గుట్ట జంక్షన్ వరకు 80 అడుగుల వెడల్పు ఉందని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అందువల్ల దారుల్ షఫా - శాలిబండ జంక్షన్ మధ్య చాలా ఆస్తుల విషయంలో ఒక్కొక్కటి 20 నుంచి 25 అడుగుల చొప్పున విస్తరణ చేయాల్సి ఉంటుందన్నారు.

అలాగే శాలిబండ నుంచి చంద్రాయణ గుట్ట మధ్య ఒక్కో భవనాన్ని 10 అడుగుల వరకు విస్తరణ చేయాల్సి ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. స్టేషన్లు, మూలమలుపులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ కాస్తా ఎక్కువగా ఉంటుందన్నారు. భూసేకరణ కోసం సంప్రదాయంగా వస్తున్న సర్వే పద్ధతులతో పాటు 3డీలో వీక్షించేలా లైడార్ డ్రోన్ సర్వే చేసినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. దానివల్ల ప్రభావితమయ్యే ఆస్తులతోపాటు చుట్టుపక్కల నిర్మాణాలు కూడా కనిపిస్తాయన్నారు. ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హెచ్ఏఎంఎల్ ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మెట్రో మార్గంలో 103 మతపరమైన, సున్నితమైన కట్టడాల పరిరక్షణ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మెట్రో ఎండీ వెల్లడించారు. విలక్షణ ఇంజినీరింగ్ పద్ధతుల ద్వారా సంరక్షించేలా, పిల్లర్లు, స్టేషన్ల వద్ద జాగ్రత్తగా సర్దుబాటు చేస్తూ మెట్రో మార్గాన్ని ముందుకు తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. పాతబస్తీలో మెట్రో రైలు కోసం భూసేకరణ ప్రక్రియ 8 నెలల్లో పూర్తవుతుందని, ప్రభావిత ఆస్తులకు సంబంధించిన యజమానులు తమ అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా మెట్రో రైలు భూసేకరణ అధికారి కార్యాలయం వద్ద దాఖలు చేయాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కోరారు

## రాజకీయ లబ్ది కోసమే

# రుణమాఫీ పై డ్రామాలు ఆడుతున్న బీఆర్ఎస్

- దేశ చరిత్రలోనే రెండు లక్షల రుణమాఫీ సాహసోపేతమైన నిర్ణయం.
- అర్హులైన ప్రతి రైతు కు రుణమాఫీ చేసి తీరుతాం..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



**బలగం టీవీ , వేములవాడ**

రాజకీయ లబ్ధి కోసమే రుణమాఫీ పై బీఆర్ఎస్ పార్టీ ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చందుర్తి మండలం మల్యాల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొన్నటి వరకు అధికారంలో ఉండి రైతు సమస్యల పైన ఏ మాత్రం పట్టించుకోని టిఆర్ఎస్ నాయకులు, ఈరోజు రోడ్డు మీద ధర్నాల పేరిట డ్రామాలు ఆడుతూ రైతులను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు.దేశ చరిత్రలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రైతులందరికీ ఏక కాలంలో రుణమాఫీ చేశామని అన్నారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చాక రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో రుణమాఫీ కోసం 31 వేల కోట్లు ఆమోదింపజేసి, రుణమాఫీ జీవో తీసుకువచ్చారని అన్నారు.

జూలై 18వ తేదీన 1 లక్ష వరకు ఉన్న రైతులకు, జులై 30న లక్ష యాభై వేల వరకు, ఆగస్టు 15న 2 లక్షల వరకు రుణం తీసుకున్న రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని అన్నారు.కేవలం 27 రోజుల్లోనే దాదాపు 22.37 లక్షల మంది రైతుల కుటుంబాలకు వారి ఖాతాలో దాదాపు రూ.18 వేల కోట్ల రుణమాఫీ నిధులు జమ చేయడం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారి అని అన్నారు. కొంత మంది రైతులకు సాంకేతిక కారణాలతో కొంతమేర రుణ మాఫీ ఆగిందని స్వయాన తమ మంత్రులే చెప్పారని అన్నారు. ఆధార్ కార్డులో తప్పుల , బ్యాంకర్లు వివరాలు తప్పుగా పంపడం, రేషన్ కార్డ్ లేకపోవడం, బ్యాంకర్లు గతంలో తండ్రి పేరు పై ఉంటే తదుపరి తండ్రి విదేశాల్లోకి వెళితే వారి కొడుకు పేరు పైన రుణాలు రీ షెడ్యూల్ చేయడం వలన సాంకేతికంగా ఇబ్బందులు ఏర్పడ్డాయని అన్నారు.

రుణమాఫీ కానీ రైతుల కోసం ప్రభుత్వం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి, వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తుంది అని, రుణమాఫీ కానీ రైతులు అగ్రికల్చర్ ఆఫీసులలో దరఖాస్తు చేసుకోవాలని, వారికి కూడా రుణమాఫీ చేస్తామని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాలు బీఆర్ఎస్ నాయకులు అధికారం అనుభవించి,నేడు ధర్నాల పేరుతో రోడ్డుపై డ్రామాలు ఆడుతున్నారని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ అనాడు ధనిక రాష్ట్రమని చెప్పి, అధికారంలోకి వచ్చాక రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఏకకాలంలో చేసిన దాఖలాలు లేవు అని అన్నారు.మొదటి సారి బీఆర్ఎస్ ప్రభుత్వం 2014-15 లో రైతులకు రుణమాఫీ పావలా పావలా చేస్తూ 16వేల వేల కోట్లు మాత్రమే అని,ఇలా చేయడం వల్ల అసలు రుణమాఫీ అయిందో, మిత్తి మాఫీ అయిందో టిఆర్ఎస్ నాయకులకు తెలవాలని అన్నారు.రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని చెప్పి 2018,2019,2020 లో సున్నా మాఫీ చెసి, 2021-2022 లో ఉప ఎన్నికలు ఉన్న కాడ 408 కోట్లు మాత్రమే చేశారు అని అన్నారు.

ఎన్నికల ముందు 13 వేల కోట్లు విడుదల చేసి,అందులో రెండు లక్షల 26 వేల మంది రైతుల ఖాతాలు సరిగా లేవని తిరిగి వస్తే, ఆనాటి బీ ఆర్ఎస్ మొద్దు ప్రభుత్వం తిరిగి రైతులకు ఇవ్వలేదు అని,బిఆర్ఎస్ సర్కార్ ఇంచుమించు 10,000 కోట్ల రుణాలు ఏగ్గొట్టారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయడాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఓర్వలేక రోడ్ల పై ధర్నా చేస్తున్నారు అని అన్నారు.రోడ్లోకి ధర్నా చేస్తున్న నాయకులు రుణమాఫీ పొందారని సాటి రైతులే చెప్తున్నారు అని,సాంకేతిక కారణాలతో ఆగిపోయిన రైతుల రుణమాఫీలను చేసే బాధ్యత మాది అని అన్నారు.

రుణమాఫీ చేసిన సందర్భంగా 22వేల అకౌంట్ల డబ్బు ప్రభుత్వానికి తిరిగి వస్తే, ప్రభుత్వం చిత్తశుద్ధితో 8000 అకౌంట్లకు డబ్బులు తిరిగి ఇచ్చిందని అన్నారు.మీరు అధికారంలో ఉన్నప్పుడు పావలా పావలా రుణమాఫీ చేస్తే మేం అధికారంలోకి వచ్చిన ఎనిమిది మాసాల్లోనే 18 వేల కోట్ల రుణమాఫీ చేశాం అని,సాంకేతిక కారణాలతో ఆగిపోయిన వాటిని కూడా మాఫీ చేస్తామని అన్నారు.రాబోవు రోజుల్లో 12-12-2018 నుంచీ 09-12-2023 తీసుకున్న రైతుల రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, రెండు లక్షల పైన తీసుకున్న వారికి కూడా రుణమాఫీ చేసేందుకు మార్గదర్శకాలు చూస్తున్నామని అన్నారు.

రైతులందరూ ఎలాంటి ఆందోళన చెందకుండా, బీ ఆర్ఎస్ చేస్తున్న కుట్ర కుతంత్రంలో, సన్నాయి నొక్కులు నొక్కుతూన్న బీజేపీ నాయకుల మాటలకు ఎవరు కూడా ఆందోళన చేందవద్దని అన్నారు.మీరు ఎన్నుకున్న సేవకుడిగా మీకు మాటిస్తున్న అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తానని అన్నారు. కొంతమంది పది సంవత్సరాలు అధికారం అనుభవించి రోడ్డెక్కి వారు ఏమి మాట్లాడుతున్నారో వారికి అర్థమవడం లేదు అని,మేం ప్రజల నుంచి వచ్చాం ప్రజాపాలన అందిస్తున్నామని .ప్రజల పక్షాన ఏ సమస్య ఉన్న పరిష్కారానికి రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధంగా ఉందిఅని అన్నారు.



## ఆగస్టు 25న మెగా జాబ్ మేళా...

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ ,సిరిసిల్ల**

వేములవాడలో ఆగస్టు 25న నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా ను జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కు చెందిన ప్రముఖ ఫార్మా, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, సాఫ్ట్వేర్ హార్డ్వేర్ మార్కెటింగ్ ఆటోమొబైల్స్, మేనేజ్మెంట్, సెక్యూరిటీ, ఎం.ఎన్.సి లకు చెందిన 50 పైగా కంపెనీలతో వేములవాడ లోని మహాలింగేశ్వర గార్డెన్స్ లో ఆదివారం ఆగస్టు 25న మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని అన్నారు. మెగా జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ ,శుభ గృహ అనుభవ్ సాఫ్ట్ , వరుణ్ మోటార్స్, ఐటిసి ఫుడ్స్, రానే బ్రేక్ లైనర్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కంపెనీ మొదలగు ప్రముఖం కంపెనీలు , విప్రో ఇన్ఫోసిస్ వంటి సాఫ్ట్వేర్ కంపెనీల అనుబంధ సంస్థలు 5 వేలకు పైగా ఉద్యోగాలను ఆఫర్ చేస్తున్నాయని తెలిపారు. జిల్లాలోని పదవ తరగతి నుంచి పిజి వరకు ఉత్తీర్ణత సాధించి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు మెగా జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి..



- ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

**బలగం టీవీ ,తంగళ్లపల్లి:**

ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అదేవిధంగా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని వైదులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం( పీహెచ్ సీ) ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్లు, ఓపీ, కాన్పుల రిజిస్టర్, ఫ్రిడ్జ్ లో వ్యాక్సిన్ తనిఖీ చేసి, వివరాలు తెలుసుకున్నారు. ఓ.పీ ఎంత మంది వచ్చారు, పీహెచ్ సీలో ఈ నెలలో ఇప్పటిదాకా ప్రసవాలు ఎన్ని చేశారు, కుక్క కాటు, డెంగ్యూ టెస్ట్ కిట్ల పై ఆరా తీశారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని, ఇక్కడే అన్ని పరీక్షలు, వైద్యం అందించాలని,హాస్పిటల్, ఆవరణలో స్వచ్చత, పరిశుభ్రత పాటించాలని అన్నారు . సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా పై ప్రత్యేక దృష్టి పెట్టి టెస్టు, మెడిసిన్ అందించాలని సూచించారు. హాస్పిటల్ కు కావాల్సిన కిట్లు, మందులు ఏమైనా అవసరం ఉంటే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

**విద్యార్థులతో నిత్యం ప్రాక్టీసు చేయించాలి..**

విద్యార్థులతో నిత్యం చదవడం, రాయడం, ప్రశ్నలకు జవాబులు చెప్పేలా ప్రాక్టీసు చేయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా టీచర్లను ఆదేశించారు. తంగళ్లపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయం ఆవరణ, వంట సామాగ్రి స్టోర్ రూం, కిచెన్ పరిశీలించారు. మెనూ ప్రకారం ఏ ఏ ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారో చూశారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి, పాఠాలు భోదించారు. మ్యాథ్స్, ఇంగ్లీష్, బయో సైన్స్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేశారు. టీచర్లు పాఠాలు బోధిస్తున్నప్పుడే విద్యార్థులు నోట్స్ రాసుకోవాలని సూచించారు. ఇక్కడ పీజీ సీ ఆర్ టీ సంతోషిణి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలి..



- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ , సిరిసిల్ల**

పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలోనీ విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. శుక్రవారం కొనరావుపేట మండలంలోని మర్థనపేట ప్రాథమిక పాఠశాలను, అంగన్ వాడి కేంద్రాన్ని, మండల కేంద్రంలోని (కే.జి.బి.వి.) కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, మర్రిమడ్ల లోని ఈ.ఎం.అర్.ఎస్ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థినిలతో ముచ్చటించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం క్రింద రుచికరమైన పౌష్టికాహారాన్ని ప్రతి విద్యార్థికి అందించాలని, విద్యార్థులకు సకాలంలో అందజేయాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అంగన్వాడి కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య కేంద్రం అమలు తీరును పరిశీలించారు. పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని, బరువు తక్కువ ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు అందజేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని అధికారులకు ఆదేశించారు.

## గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటాం




- గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి..
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంజాయి విక్రయించిన, సేవించినా, సాగు చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శుక్రవారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో గంజాయి, మాదకద్రవ్యాల వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా మార్చడాని జిల్లా పోలీస్ విన్నూత కార్యక్రమలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుదని, జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు,నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుదన్నారు.

జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్ లు చేస్తూ గంజాయి సేవించే వారిని ,వారికి గంజాయి అందిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, గతంలో గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్నవారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఏర్పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించిన,సాగు చేసిన, రవాణా చేసిన సేవించిన వారి సమాచారం ఆర్ ఎస్- ఎన్ ఏ బీ 8712656392 నంబర్ కి అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంజరుగుతుదని,గంజాయి కి అలవాటు పడిన వారిని పోలీస్ డి ఆడిక్షన్ సెంటర్ లో కౌన్సెలింగ్ కోసం పై నంబర్ ని సంప్రదించాలని అన్నారు.

## గుడ్, బ్యాడ్ టచ్ అవగాహన పరచడానికే "పోక్సో పై చైతన్యం"

- విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత...
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

విద్యార్థులకు గుడ్ బ్యాడ్ టచ్ లపై అవగాహన పరచడానికే పోక్సో పై చైతన్యం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోక్సో పై చైతన్యం అవగాహన కార్యక్రమానికి ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పోలీస్ శాఖ విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని,విద్యార్థులు జీవితంలో చక్కటి లక్ష్యాలను ఎన్నుకుని సరైన మార్గంలో శ్రమిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోలే తప్ప, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నరు.జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన పరచడానికి "పోక్సో పై చైతన్యం" పేరుతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మైనర్ బాలికలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందని,తద్వారా తమ విలువైన జీవితం అంతా జైల్లోనే మగ్గిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని,మహిళలను గౌరవించడం, వారికి అండగా నిలబడడం వంటివి అలవర్చుకోవాలని అన్నారు.

చిన్నారులు తమకు ఇంట్లో,పాఠశాలలో,వీధుల్లో పొరుగువారితో ఎదురయ్యే రకరకాల వేధింపులు, అసభ్య ప్రవర్తన,గుడ్ టచ్ బ్యాడ్ టచ్ ల గురించి నిర్భయంగా తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని,తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు.విద్యార్థులు సామాజిక మాధ్యమాల అయినా ఫేస్బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే



సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు .

విద్యార్థినిలు మహిళలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని,నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నప్పుడే మరింత భద్రత కల్పించగలవుతామని అన్నారు.మహిళలు,విద్యార్థినిలు జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేయాలనిఅని అన్నారు.పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సిరిసిల్ల టౌన్ సిఐ కృష్ణ,జిల్లా సంక్షేమ అధికారి పి లక్ష్మీరాజాం,సిడబ్ల్యుసి చైర్పర్సన్ అంజయ్య,షీ టీం ఏఎస్ఐ ప్రమీల, షీ టీం సిబ్బంది రమాదేవి, ప్రియాంక,మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా,ఐసిపిఎస్ సిబ్బంది, సఖి సిబ్బంది,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపన్న హస్తం అందించిన ఆది..

- భార్య మృతి చెందగా భర్తను స్వగ్రామం రప్పించడానికి సౌదిలో కంపెనీ అధికారులకు లేఖ రాసిన ప్రభుత్వ విప్
- తిరుగు ప్రయాణానికయ్యే ఖర్చు భరించడానికి ముందుకు..

**బలగం టీవీ , సిరిసిల్ల :**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మరోసారి మానవత్వం చాటుకున్నారు.గల్ఫ్ కార్మికుని భార్య ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందగా, భర్త ను స్వగ్రామం తెప్పించడానికి సౌదీలో భర్త పనిచేస్తున్న కంపెనీకి లేఖ రాసి, తిరుగు ప్రయాణానికి అయ్యే ఖర్చు భరించడానికి ముందుకు వచ్చి మానవత్వం చాటుకున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ముష్టిపల్లి గ్రామానికి చెందిన చీమల సంతోషి వ్యవసాయ పనులను ముగించుకొని ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందగా,సంతోషి భర్త చీమల మహేష్ నెల రోజుల క్రితం బ్రతుకుదేరువు నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లి దమంలోని నెస్మా అండ్ పార్టనర్ కంపెనీ లో పని చేస్తున్నాడు.

సంతోషి మృతి చెందడంతో చీమల మహేష్ ను భారతదేశానికి త్వరగా తీసుకురావాల్సిందిగా మహేష్ బంధువులు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ని సంప్రదించగా,తక్షణమే స్పందించిన ప్రభుత్వ విప్ చీమల మహేష్ ను త్వరగా స్వదేశానికి పంపించాల్సిందిగా కోరుతూ సౌదీ అరేబియా దమంలోని నెస్మా అండ్ పార్టనర్ కంపెనీ కి లేఖ రాసి అధికారులతో మాట్లాడాడు. వెంటనే స్పందించిన కంపెనీ యాజమాన్యం చీమల మహేష్ భార్య మృతికి సంతాపం తెలియజేస్తూ అతన్ని భారతదేశానికి పంపించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, శుక్రవారం స్వదేశానికి పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.. కాగా ఆపదలో ఉన్నామని ఆది శ్రీనివాస్ కు తెలపగానే తక్షణమే స్పందించడం పట్ల పలువురు హర్షం చేస్తున్నారు.

## కాకినాడలో మట్కా కీలక షెడ్యూల్

**బలగం టీవీ , హైదరాబాద్**

వరుణ్ తేజ్ తాజాగా 'మట్కా' సినిమాతో పాన్ ఇండియాలో అడుగు పెడుతున్నారు. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్టైన్మెంట్స్, ఎస్ఆర్టి ఎంటర్టైన్మెంట్స్ పతాకాలపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ మూవీని నిర్మిస్తున్నారు. వరుణ్ తేజ్‌ని డిఫరెంట్ లుక్స్‌లో ప్రజెంట్ చేసిన ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.




ప్రస్తుతం ఈ సినిమా కాకినాడలో షూటింగ్ జరుపుకుంటోంది. ఈ ముఖ్యమైన షెడ్యూల్‌లో టాకీ పార్ట్, ప్రముఖ తారాగణంతో యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరించనుంది. మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో వరుణ్ తేజ్ చేతిలో తుపాకీతో కాకినాడ ఓడరేవులో క్రూయిజ్ షిప్ ముందు నిలబడి కనిపించారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమాలో వరుణ్ తేజ్ డిఫరెంట్ మేకోవర్‌లలో కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లుగా నటిస్తున్నారు. నవీన్ చంద్ర, సలోని, అజరు ఘోష్, కన్నడ కిషోర్, రవీంద్ర విజరు, పి రవి శంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డీవోపీ: ఎ కిషోర్ కుమార్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: కిరణ్ కుమార్ మన్నె, సీఈఓ: ఈవీవీ సతీష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్కే జానా, ప్రశాంత్ మండవ, సాగర్, కాస్ట్యూమ్స్: కిలారి లక్ష్మి.

# మళ్లీ మెరిసిన నీరజ్ చోప్రా



బలగం టీవీ, హైదరాబాద్

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరోసారి మెరిశాడు. తాజాగా జరిగిన లుసానె డైమండ్ లీగ్‌లో రెండో స్థానంలో నిలిచాడు. 89.49 మీటర్లు ఈటెను విసిరిన నీరజ్ ఈ సీజన్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. అయితే ఎప్పటి లాగే ఈ సారి కూడా అతడి 90 మీటర్ల కల మాత్రం నెరవేరలేదు. గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ 90.61 మీటర్లు ఈటెను విసిరి ఈ లుసానె డైమండ్ లీగ్‌లో అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. జర్మన్ అథ్లెట్ వెబర్ జులియన్ 87.08 మీటర్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.

మొదటి రౌండ్‌లో 82.10 మీటర్లు ఈటెను విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు నీరజ్ చోప్రా. ఆ తర్వాత వరుసగా 83.21 మీటర్లు, 83.13 మీటర్లు, 82.34 మీటర్లు, 85.58 మీటర్ల ప్రదర్శన కనబరిచాడు. ఇక ఫైనల్ రౌండ్‌లో గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ జావెలిన్‌ను 90.61 మీటర్లు విసరగా, నీరజ్ చోప్రా తన శక్తినంతా ఉపయోగించి 89.49 మీటర్లు ఈటెను విసిరాడు. ఇది నీరజ్ కెరీర్‌లో రెండో అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. అంతకుముందు స్టాక్ హెూమ్ డైమండ్ లీగ్ 2022లో 89.94 మీటర్లు ఈటెను విసిరాడు. ఇప్పటి వరకు అతడి కెరీర్‌లో ఈ స్టాక్ హెూమ్ డైమండ్ లీగ్ ప్రదర్శనే అత్యుత్తమం.

ఇటీవల పారిస్ ఒలింపిక్స్ 2024లో ఎన్నో అంచనాలతో బరిలోకి దిగాడు నీరజ్ చోప్రా 89.45 మీటర్లు ఈటెను విసిరి సిల్వర్ మెడల్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇక 2022లో 87.66 మీటర్లు ఈటెను విసిరి డైమండ్ లీగ్ విజేతగా నిలిచాడు నీరజ్ చోప్రా. అనంతరం 2023 డైమండ్ లీగ్‌లోనూ 89.08 మీటర్లు విసిరి ఎప్పటికీ గుర్తిండిపోయే ప్రదర్శన చేశాడు.

## 2025-27 డబ్ల్యూటీసిలో
# ఇంగ్లాండ్‌తో భారత్ తొలి పోరు




బలగం టీవీ, హైదరాబాద్

ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 సైకిల్‌ను భారత జట్టు ఇంగ్లండ్‌తో జరుగబోయే ఐదు టెస్టులతో ఆరంభించనుంది. ప్రస్తుత సైకిల్ (2023-25) వచ్చే ఏడాది జూన్‌తో ముగియనుండగా అప్పటికి టాప్-2లో ఉన్న జట్లు డబ్ల్యూటీసీ ట్రోఫీ కోసం తలపడతాయి. జూన్‌లో జరుగనున్న 2023-25 సైకిల్ ఫైనల్‌లో భారత్ వరుసగా మూడోసారి తుది పోరుకు అర్హత సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ ముగిసిన వెంటనే రోహిత్ సేన ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌తో వేట మొదలుపెట్టనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) సంయుక్తంగా షెడ్యూల్‌ను ప్రకటించాయి. జూన్ 20 నుంచి ఆగస్టు 4 దాకా జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా హెడింగ్లీ (లీడ్స్), ఎడ్జ్‌బాస్టన్ (బర్మింగ్‌హామ్), లార్డ్స్ (లండన్), ఓల్డ్ ట్రాఫర్డ్ (మాంచెస్టర్), ది ఓవల్ (లండన్) వేదికలను ఈసీబీ ఖరారు చేసింది.

# ధోనీ విషయంలో తప్పు చేశాను.. క్షమించండి: దినేశ్ కార్తీక్




బలగం టీవీ, హైదరాబాద్

ఎంఎస్ ధోనీ విషయంలో చాలా పెద్ద తప్పు చేశానని టీమిండియా మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ పేర్కొన్నాడు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్ని ఫార్మాట్లలో కలిపి తన ఆల్‌టైమ్ భారత క్రికెట్ జట్టును దినేశ్ ప్రకటించాడు. అయితే కార్తీక్ ఆల్‌టైమ్ ఎలవెన్‌లో ధోనీ పేరు లేదు. సారథిగా దేశానికి 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీలను అందించిన ధోనీని డీకే విస్మరించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో దినేశ్ కార్తీక్ తాను ప్రకటించిన జట్టు గురించి వివరణ ఇచ్చాడు. తన జట్టులో వికెట్ కీపర్ స్థానాన్నే మర్చిపోయానని, అందరూ రాహుల్ ద్రవిడ్‌ను వికెట్ కీపర్‌గా ఎంపిక చేశానని అనుకున్నారని డీకే అన్నాడు.

“నేను పెద్ద తప్పు చేశాను. అది పొరపాటును జరిగింది. ఎపిసోడ్ రిలీజ్ తర్వాత ఈ విషయం నాకు అర్థమైంది. ప్రకటించిన 11 మందిలో వికెట్ కీపర్ మిస్ చేశాను. కానీ, ద్రవిడ్‌ను పార్ట్ టైమ్ వికెట్ కీపర్‌గా తీసుకున్నారని అనుకున్నారంతా. కానీ ద్రవిడ్‌ను కీపర్‌గా భావించి తీసుకోలేదు. వికెట్ కీపర్‌ను అయిన నేను.. వికెట్ కీపర్ ఎంపికను మర్చిపోయారంటే నమ్ముతారా? ఇది చాలా పెద్ద పొరపాటు. ఇక ఓ విషయాన్ని స్పష్టం చేయాలనుకుంటున్నాను. ధోనీ పేరు ఏ ఫార్మాట్‌లోనైనా ఉంటుంది. భారత్‌లోనే కాదు, ఎక్కడైనా. గొప్ప క్రికెటర్లలో అతనొక్కడు. ఇక ఆల్‌టైమ్ జట్టును మళ్లీ ప్రకటించాల్సి వస్తే నేను చేసే మార్పు ఒక్కటే. ధోనీ ఏడో స్థానంలో ఉంటాడు. అంతేగాక ఏ భారత జట్టుకు అయినా అతనే కెప్టెన్” అని దినేశ్ కార్తీక్ పేర్కొన్నాడు.

దినేశ్ కార్తీక్ ప్రకటించిన ఆల్‌టైమ్ ఎలెవన్: వీరేంద్ర సెహ్వాగ్, రోహిత్ శర్మ, రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, యువరాజ్ సింగ్, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, అనిల్ కుంబ్లే, జస్‌ప్రీత్ బుమ్రా, జహీర్‌ఖాన్ 12వ ఆటగాడు: హర్భజన్ సింగ్.



# ఓజీ బ్యాక్ ఆన్ మిషన్.. వైరల్

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ యాక్టర్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సినిమాల విషయంలో సినిమాలకు బ్రేక్ తీసుకున్నారని తెలిసిందే. ప్రస్తుతం ఓజీతోపాటు ఉస్తాద్‌భగత్ సింగ్, హరిహరవీరమల్లు సినిమాల్లో నటిస్తున్నారు పవన్ కల్యాణ్. అయితే అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది.త్వరలోనే షూటింగ్స్‌లో పాల్గొనబోతున్నారని తెలుస్తోంది. తాజాగా ఓజీ అండ్ స్క్వాడ్ టీం బ్యాక్ ఆన్ మిషన్.. అనే క్యాప్షన్‌తో పవన్ కల్యాణ్, సుజిత్, నిర్మాత డీవీవీ దానయ్య కలిసి దిగిన ఫొటోను డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. పవన్ కల్యాణ్ ఓజీ షూటింగ్‌లో జాయిన్ అవబోతున్నాడని తాజా స్టిల్ చెప్పకనే చెబుతోంది. ఈ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది.

# మిరాయి నుంచి తేజ సజ్జా లుక్..!





బలగం టీవీ, హైదరాబాద్

హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు టాలీవుడ్ యంగ్ యాక్టర్ తేజసజ్జా ఈ టాలెంటెడ్ యాక్టర్ పాన్ ఇండియా అడ్వెంచరస్ మూవీ మిరాయిచేస్తున్నాడని తెలిసిందే. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికానాయక్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తేజ సజ్జా బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఇంటెన్స్ లుక్ ఒకటి విడుదల చేశారు మేకర్స్. తేజ సజ్జా ఎత్తైన భవంతిపై నుంచి ఓ ఐరన్ రాడ్‌ను పట్టుకుని తనను తాను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నట్టుగా కనిపిస్తున్న పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఎడ్రినలిన్ రైడ్ ఫీల్ అందించే సూపర్ యోధ జననం.. అంటూ విడుదల చేసిన తాజా లుక్‌తో ఈ సినిమా యాక్షన్ మూవీ లవర్స్ ను ఇంప్రెస్ చేయడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీలో మంచు మనోజ్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే మంచు మనోజ్ మిరాయి లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి గౌరా హరి మ్యూజిక్ డైరెక్టర్. ఈ చిత్రం 2025 ఏప్రిల్ 18న 2డీ, 3డీ వెర్షన్లలో ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# సైలెంట్‌గా వస్తాం పెద్ద సక్సెస్ సాధిస్తాం

- ‘రాజాసాబ్’ నిర్మాత




బలగం టీవీ, హైదరాబాద్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మారుతి దర్శకత్వంలో నటిస్తున్న సినిమా ‘రాజాసాబ్’. రొమాంటిక్ హారర్ కామెడీగా రానున్న ఈ మూవీ గురించి తాజాగా చిత్ర నిర్మాత విశ్వప్రసాద్ కొన్ని ఆసక్తికరమైన విషయాలను చెప్పారు. “మేము సైలెంట్‌గా వస్తాం. పెద్ద సక్సెస్ సాధిస్తాం. ఈ చిత్రాన్ని ప్రారంభించినప్పుడు ప్రభాస్ లైనప్‌లో చాలా పెద్ద సినిమాలు ఉన్నాయి. ఇక ఈ మూవీ షూటింగ్ చాలా సైలెంట్‌గా మొదలై జరుగుతోంది. నిజానికి ఇది చాలా పెద్ద సినిమా. ఈ చిత్రం కోసం 38,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో సెట్ వేశాం. ఇప్పటివరకు ఇండియాలో ఇంత భారీ సెట్ ఏ చిత్రానికి వేయలేదు. హారర్, రొమాంటిక్, యాక్షన్ ఇలా అన్ని ఎలిమెంట్స్ సినిమాలో ఉంటాయి. వీఎఫ్‌ఎక్స్‌కు పెద్దపీట వేశాం. మ్యూజిక్ కూడా నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. ఫైట్స్, ఎఫెక్ట్స్ అన్నీ బాగుంటాయి” అని విశ్వ ప్రసాద్ చెప్పారు. దీంతో ప్రభాస్ అభిమానుల్లో మరింత అంచనాలు పెరిగాయి.కాగా, మారుతి - ప్రభాస్ కాంబోలో రాబోతున్న మొదటి చిత్రమిది. నిధి అగర్వాల్, రిద్ధి కుమార్, మాళవిక మోహన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 2025 ఏప్రిల్ 10న మూవీ రిలీజ్ కానుంది. ఇప్పటికే ‘ఫ్యాన్ ఇండియా గ్లింప్స్’ పేరుతో రిలీజైన స్పెషల్ వీడియో బాగా ఆకట్టుకుంది.

# రవితేజకు షూటింగ్‌లో ప్రమాదం.. 6 వారాలు రెస్ట్



బలగం టీవీ, హైదరాబాద్

మాస్ మహారాజ రవితేజకు షూటింగ్‌లో ప్రమాదం జరిగింది. రవితేజ 67 ప్రాజెక్ట్ షూటింగ్ సమయంలో రవితేజకు ప్రమాదం జరుగగా.. అతడి కుడిచేతికి గాయం అయ్యింది. అయితే నొప్పిభరిస్తునే షూటింగ్‌లో పాల్గొన్నాడు రవితేజ. అయితే షూటింగ్ అనంతరం ఈ గాయం ఎక్కువ కావడం వలన చిత్రబృందం ఆయనను ఆస్పత్రికి తరలించారు. రవితేజను పరిశీలించిన వైద్యులు శస్త్రచికిత్స చేసి, ఆరు వారాల పాటు రెస్ట్ తీసుకోవాలని సూచించారు. ఇక రవితేజకు ప్రమాదం జరిగిందని తెలుసుకున్న అతని అభిమానులు ఆస్పత్రికి తరలివస్తున్నారు. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని వేడుకుంటున్నారు.గత కొన్ని రోజులుగా హిట్లు లేక సతమవుతున్నాడు రవితేజ. గత ఏడాది రావణసుర, టైగర్ నాగేశ్వర రావు అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి డిజాస్టర్‌లు అందుకున్నాడు. అయితే ఈ ఏడాది కూడా రవితేజకు కలిసి రాలేదు. ఈగల్ అంటూ ఈ ఏడాది ముందుకు వచ్చి ఫ్లాప్ అందుకున్నాడు. ఆ తర్వాత రీసెంట్‌గా మిస్టర్ బచ్చన్ అంటూ మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చి మరో ఫ్లాప్‌ను ముటగట్టుకున్నాడు.